# వాస్తవం డెయిలీ.కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

సోమవారం 09.03.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి


## ఓల్డ్ సిటీ కాదు ఒరిజినల్ సిటీ



9లో..

శాంసన్, బుమ్రా దెబ్బకు కుదేలైన న్యూజిలాండ్..

మూడోసారి టీ20 ఛాంపియన్‌గా భారత్

అక్షర్ మ్యాజిక్

శాంసన్, అభిషేక్ ఊచకోత

# జయహో భారత్

### ఫైనల్లో న్యూజిలాండ్‌పై ఘనవిజయం

సందేహాలన్నీ పటాపంచలయ్యాయి.. ఫైనల్‌కు ముందు అభిమానుల మదిలో ఎన్ని ప్రశ్నలో? ఇదే వేదికపై 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ ఓటమి కళ్ల ముందే ఉంది.. అటు చూస్తే ఈ టోర్నీ చరిత్రలో న్యూజిలాండ్‌పై గెలిచిన ఉదంతాలే లేవు. అందుకే ఆదివారం జరిగే అంతిమ పోరులో మనోళ్ల పరిస్థితి ఏమిటనే ఉత్కంఠ అందరిలోనూ కనిపించింది. కానీ చివరి అడుగులో సూర్యకుమార్ సేన సింహంలా గర్జించింది. ఎక్కడ పోగొట్టుకున్నామో, అక్కడే సాధించి అందరినీ తలెత్తుకుని చిందేసేలా చేసింది. అటు బ్యాటింగ్‌లో శాంసన్, ఇషాన్, అభిషేక్ త్రయం రికార్డుల మోతతో ఆకాశమే హద్దుగా చెలరేగారు. అయినా ఫ్లాట్ పిచ్‌పై ఎంత స్కోరైనా ప్రమాదకరమే అనిపించిన వేళ.. భారత జట్టు బౌలర్లు మేమున్నామంటూ అండగా నిలిచారు. పకడ్బందీ బంతులతో కివీస్ బ్యాటర్లను కుమ్మేశారు. కేవలం ముగ్గురు మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగలిగారు. ఫలితంగా.. వరుసగా రెండోసారి కప్‌ను సాధించి హిస్టరీని రిపీట్ చేశాం.అంతేనా.. కివీస్‌పై గెలవని అపఖ్యాతిని.. ఆతిథ్య దేశం ట్రోఫీని సాధించదనే సెంటిమెంట్‌నూ బ్రేక్ చేసి హిస్టరీని డిఫీట్ కూడా చేశాం.. జయహో భారత్




9లో..

## మండలి భేటీలూ.. ఇక అసెంబ్లీ భవనంలోనే

పునరుద్ధరించిన శాసనమండలి హాల్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

16 నుంచి బడ్జెట్ సమావేశాలు



**హైదరాబాద్, మార్చి 8 :** తెలంగాణ శాసనమండలి సమావేశాలు కూడా ఇకపై అసెంబ్లీ భవనంలోనే జరగనున్నాయి. ఈ నెల 16న ప్రా రంభం కానున్న బడ్జెట్ సమావేశాల నుంచే ఇది అమల్లోకి రానుంది. ఈ మేరకు అసెంబ్లీ భవనంలో పునరుద్ధరించిన మండలి సమావేశ మందిరాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆ మందిరానికి అనుబంధంగా పునరుద్ధరించిన తన చాంబర్‌ను, చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చాంబర్‌ను, మంత్రులు, మండలి సభ్యుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లాంజ్‌లను సీఎం పరిశీలించారు. తన కోసం ఏర్పాటు చేసిన చాంబర్‌లో ప్రత్యేక పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్, మండలి చైర్మన్, మంత్రులు, ఇతర ఆహ్వానితులతో కొద్దిసేపు సమావేశమయ్యారు. పార్లమెంటు తరహాలో అసెంబ్లీ ప్రాంగణంలోనే కాన్‌స్టిట్యూషన్ క్లబ్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. అలాగే అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఈ నెల 16న కొత్త గవర్నర్‌తో ఆవిష్కరింపజేసుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రు లు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూ పల్లి కృష్ణారావు, అజారుద్దీన్, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

**పార్లమెంటు తరహాలో..**

లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలు పార్లమెంటు భవనంలో జరుగుతున్నట్లుగానే.. ఇకపై తెలంగాణ అసెంబ్లీ భవనంలోనే శాసనసభ, మండలి సమావేశాలు నిర్వహించనున్నారు. శాసనసభ, మండలి హాళ్లకు మధ్య ఉన్న ప్రాంతంలో అసెంబ్లీ సెంట్రల్ హాల్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ తరహా ఏర్పాట్లతో సీఎం, మంత్రులు, అసెంబ్లీ సిబ్బందికి సమయం ఆదా కానుందని, సమావేశాల వ్యయం కూడా తగ్గనుందని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. కాగా.. శాసనమండలి హాల్‌ను అధునాతన సౌకర్యాలతో పునరుద్ధరించారు.

## కన్నతండ్రే కడతేర్చాడు!

ముగ్గురు కూతుళ్లను పోషించలేక హత్య

నిందితుడి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు



కామారెడ్డి, మార్చి 8 : కామారెడ్డి జిల్లా కేంద్రంలో అదృశ్యమైన ముగ్గురు పిల్లల మృతదేహాలు చెరువులో లభ్యం కాగా.. వారిని హత్యచేసింది కన్నతండ్రేనని పోలీసులు తెలిపారు. ఏఎస్పీ చైతన్యారెడ్డి ఆదివారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఘటనకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. కామారెడ్డి పట్టణంలోని ఆర్‌బీనగర్ కాలనీకి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు సీపాత్ (8), అయాత్ (7), మరియం (5) శనివారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి, తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఎస్పీ రాజేశ్‌చంద్ర ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలతో విచారణ చేపట్టిన పోలీసులు ..పిల్లలను ఎక్కడికి తీసుకెళ్లారో సీసీ కెమెరాల ద్వారా పరిశీలించారు. పరారీలో ఉన్న తండ్రి ఇస్మాయిల్‌ను ఆదివారం అదుపులోకి తీసుకొని విచారించగా.. అప్పులు, ఆర్థిక భారంతో తానే ముగ్గురు పిల్లలను కామారెడ్డి పెద్ద చెరువులో తోసేసినట్టు ఒప్పుకున్నాడు. గజఈతగాళ్ల సాయంతో అయాత్, మరియం, సీపాత్ మృతదేహాలను వెలికితీసి, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్ పంపినట్టు ఎస్పీ తెలిపారు. అలాగే ఈ నెల 6న అదృశ్యమైన గోసంగి కాలనీకి చెందిన ఇద్దరు పిల్లల జాడను త్వరలోనే గుర్తిస్తామని చెప్పారు. సమావేశంలో పట్టణ, రూరల్ సీఐలు నరహరి, రామన్ పాల్గొన్నారు.

## నేటి నుంచి మలి విడత బడ్జెట్ సమావేశాలు

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానంపై చర్చ

రష్యా చమురు కొనుగోలుకు భారత్‌కు ట్రంప్ అనుమతిపై ప్రశ్నించనున్న విపక్షాలు

పశ్చిమాసియా యుద్ధంపైనా చర్చ

**న్యూఢిల్లీ, మార్చి 8:**

పార్లమెంట్ మలి విడత బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కాబోతున్నాయి. నేటి అజెండా ప్రకారం, స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం లోక్‌సభ వ్యవహారాల్లో లిస్ట్ చేసిన ఏకైక అంశంగా ఉంది. దీంతో అధికార బీజేపీ, విపక్ష కాంగ్రెస్ రెండూ విప్ జారీచేశాయి. టీఎంసీ కూడా బిర్లాకు వ్యతిరేకంగా తీర్మానానికి మద్దతు తెలుపుతున్నది. దీంతో బడ్జెట్ సమావేశాల రెండవ భాగం.. వాడీవేడిగా జరిగేందుకు రంగం సిద్ధమైంది. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానంతో పాటు, ఇరాన్‌పై యుద్ధం, పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ధరల పెరుగుదలకు దారితీసే అంశాలు, రష్యా నుంచి చమురు కొనుగోలుకు ట్రంప్ 'అనుమతి'.. తదితర అంశాలు చర్చకు రానున్నాయి. మోదీ సర్కార్ వైఖరిని ప్రశ్నించాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. టీఎంసీ సభ్యులు సభలో 'సర్' అంశాన్ని లేవనెత్తితే.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రొటోకాల్ ఉల్లంఘన అంశాన్ని బీజేపీ లేవనెత్తవచ్చు. బడ్జెట్ సమావేశాల్లో సమయం మిగిలితే విద్యుత్తు సవరణ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టవచ్చు.



# ఎల్లారెడ్డిపేటలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**వాస్తవం : ఎల్లారెడ్డిపేట:**



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డిపేట పాత బస్టాండ్ వద్ద మహిళా సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహేశ్వరి సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, నేటికీ మహిళలకు పూర్తి స్థాయి రక్షణ కల్పించడంలో లోపాలు ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. మహిళలకు కఠినమైన చట్టాలు అమలు చేయడంతో పాటు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా హక్కులు, అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. మహిళలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సమాన హక్కుల కోసం పోరాడాలని, చరిత్రలో మహిళలు ఎన్నో రంగాలలో పోరాటాలు చేసి విజయాలు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మిడ్ డే మిల్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ నేటికీ మహిళలు శ్రమ దోపిడికి గురవుతున్నారని, అన్ని రంగాలలో సముచిత వేతనాలు చెల్లించాలని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. మహిళలపై జరుగుతున్న లైంగిక హింసకు వ్యతిరేకంగా మహిళలందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధవ భారతి, లింబవ భాగ్యలక్ష్మి,మల్లవ్వ, మణమ్మ, నరసవ్వ, రేణుక,లత,రాజవ్వ, మానస తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పోలీస్ సిబ్బందికి ఘన సత్కారం




**వాస్తవం : ధర్మసాగర్**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇన్స్పెక్టర్ కే. శ్రీధర్ రావు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందిని వారి సేవలను అభినందిస్తూ శాలువాలతో ఘనంగా సత్కరించి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీధర్ రావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉంటూ సమాజ అభివృద్ధికి ముఖ్య పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐలు నరసింహారావు, దిలీప్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఖమేని మృతికి భారీ మూల్యం తప్పదు

## ట్రంప్‌కు ఇరాన్ హెచ్చరిక





## » ఇరాన్ వర్సెస్ అమెరికా

## ఆయనెవరో తెలియదు హెచ్చరికలకు భయపడం

**• డోనాల్డ్ ట్రంప్ కౌంటర్**

**ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మృతికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మూల్యం చెల్లించుకోక తప్పదని జాతీయ భద్రతా మండలి కార్యదర్శి అలీ లారిజాని హెచ్చరించారు. ఖమేనీకి అత్యంత సన్నిహితుల్లో ఒకరైన ఆయన.. తమ నాయకుడి మృతికి ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరిస్తూ ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టా రు.తాము ట్రంప్‌ను వదిలిపెట్టమని, ఖమేనీ మృతికి ఆయన తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనని లారిజాని పేర్కొన్నారు.**

ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మృతికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మూల్యం చెల్లించుకోక తప్పదని జాతీయ భద్రతా మండలి కార్యదర్శి అలీ లారిజాని హెచ్చరించారు. ఖమేనీకి అత్యంత సన్నిహితుల్లో ఒకరైన ఆయన.. తమ నాయకుడి మృతికి ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరిస్తూ ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టారు.తాము ట్రంప్‌ను వదిలిపెట్టమని, ఖమేనీ మృతికి ఆయన తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనని లారిజాని పేర్కొన్నారు. దాడుల్లో తమ నాయకుడితో సహా అనేక మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఇది సాధారణ విషయం కాదని, దీనికి తగిన రీతిలో తాము ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఈ యుద్ధంలో తాము అనేక మంది అమెరికన్ సైనికులను బంధించామని అలీ లారిజాని మరో పోస్టులో పేర్కొన్నారు.బంధీలను జైళ్లలో ఉంచినట్లు తెలిపారు. ఇరాన్ దాడుల్లో కేవలం ఆరుగురు యూఎస్ సైనికులే ప్రాణాలు కోల్పోయారంటూ ట్రంప్ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. నిజానికి చాలామంది చనిపోయారని తెలిపారు. కొన్ని రోజుల తర్వాత ప్రమాదాలు, కల్పిత సంఘటనలతో మృతుల సంఖ్యను పెంచేస్తారని ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితులపై లారిజాని స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. అమెరికా, ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు కొనసాగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు.వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోని యూఎస్ బలగాలు బంధీగా తీసుకెళ్లిన విషయాన్ని లారిజాని ప్రస్తావించారు. వెనెజువెలాలో మాదిరిగా ఇరాన్‌లో కూడా త్వరగా యుద్ధం ముగించేయాలనుకున్నారని, కానీ అది విఫలమైందని అన్నారు. అయితే యూఎస్ సైనికులను బంధించామంటూ లారిజాని చేసిన ఆరోపణలను అమెరికా ఖండించింది. ఇవి ఆ దేశ ప్రభుత్వ అబద్ధాలు, మోసాలకు మరో నిదర్శనమని సెంటాకామ్ ప్రతినిధి మీడియాతో అన్నారు.

### అతడెవరో కూడా తెలియదు, ఆ హెచ్చరికలను లెక్కచేయను : ట్రంప్

ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి అలీ లారిజానీ తాజాగా ఇచ్చిన వార్నింగ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. అలీ ఎవరో కూడా తనకు తెలియదని అన్నారు. ఆ హెచ్చరికలను పట్టించుకోనని స్పష్టం చేశారు. ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ కామెంట్స్ చేశారు. సుప్రీం లీడర్ ఖమేనీ మృతికి కారణమైన ట్రంప్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని అలీ లారిజానీ హెచ్చరించిన విషయం తెలిసిందే. ‘అతను మాట్లాడేదేంటో నాకు అర్థం కావట్లేదు. అసలు అతను ఎవరు? అతని వార్నింగ్స్‌ను నేను లెక్క చేయను’ అని అన్నారు. బేషరతుగా ఇరాన్ లొంగిపోయే వరకూ దాడులు కొనసాగుతాయని మరోసారి స్పష్టం చేశారు.ఇరాన్ జాతీయ భద్రతా మండలి నేత అలీ లారిజానీ గతంలో ఇరానియన్ రెవల్యూషనరీ గార్డ్స్‌లో కూడా పనిచేశారు. ఇటీవల ఆయన ట్రంప్‌నకు ఎక్స్ వేదికగా హెచ్చరికలు చేశారు. ‘ట్రంప్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఆయన చేసిన పనికి మూల్యం చెల్లించుకోక తప్పదు. మా లీడర్ మృతికి ఆయనే కారణం. మా ప్రజల్లో సుమారు 1000 మంది అమెరికా దాడుల్లో నేలకొరిగారు. ఇది సామాన్యమైన విషయం కాదు’ అని అన్నారు.అమెరికా, ఇజ్రాయెల్‌లు కలిసి ఇరాన్‌ను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నాయని అలీ లారిజానీ ఆరోపించారు. మౌలిక స్థాయిలో ఇరాన్ పతనం కోసం ప్రయత్నిస్తున్నాయని అన్నారు. వెనెజువెలా వలెనే ఇరాన్ విషయం త్వరగా ముగిసిపోతుందని అమెరికా అనుకున్నప్పటికీ అలా జరగలేదని చెప్పారు. పశ్చిమాసియా, ఇరాన్ నేపథ్యం గురించి అమెరికన్లు అర్థం చేసుకోలేకపోయారని అన్నారు. ఇక ప్రస్తుతం ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా మధ్య పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. ఇరాన్‌కు మరిన్ని సర్‌ప్రైజ్‌లు ఇవ్వబోతున్నామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నేతన్యాహూ తాజాగా హెచ్చరించారు.

# వరంగల్ నగరానికి భూగర్భ డ్రెయినేజీ మంజూరు

**సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ డా. కడియం కావ్య కృతజ్ఞతలు**



**వాస్తవం,హన్మకొండ, మార్చి 08:** వరంగల్ మహానగరానికి భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ (అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ) ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5,257.20 కోట్లకు పాలనాపరమైన మంజూరు ఇవ్వడం పట్ల శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య గార్లతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ మహానగరానికి భూగర్భ డ్రెయినేజీ ప్రాజెక్టు మంజూరు చేయడం ద్వారా దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రజల కలను ముఖ్యమంత్రి నెరవేర్చారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు.హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో రెండో ప్రధాన నగరంగా వరంగల్ మహానగరాన్ని అభివృద్ధి చేస్తామని ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నారని ఎంపీ తెలిపారు. మౌలిక సదుపాయాలు, వైద్య, విద్య, రవాణా తదితర అన్ని రంగాల్లో వరంగల్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందని ఎంపీ అన్నారు. భూగర్భ డ్రెయినేజీ ప్రాజెక్టు అమలుతో నగరంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు వరద ముంపు సమస్యలు కూడా తగ్గుముఖం పడతాయని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వరంగల్ మహానగర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.వరంగల్‌ను రెండో రాజధానిగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులను అమలు చేస్తున్నదని చెప్పారు. త్వరలోనే మామునూర్ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని, అలాగే రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ స్థాపనతో పాటు కాకతీయ టెక్స్‌టైల్ పరిశ్రమల ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు అమలులోకి వస్తే వరంగల్ పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో కొత్త దశకు చేరుకుంటుందని ఎంపీ డా.కడియం కావ్య స్పష్టం చేశారు.

## దివ్యాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**వాస్తవం : ఎల్లారెడ్డిపేట:** సిరిసిల్లలోని గాంధీనగర్‌లో హరే కృష్ణ టెంట్ హౌస్ వద్ద జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం అధ్యక్షుడు వెల్డి గణేష్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా జిల్లా అడ్మినిస్ట్రేషన్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పనిచేస్తున్న దివ్యాంగుడు బాల మహేష్ మరియు ఇతర ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. 2024 డిసెంబర్ 7న ప్రారంభమైన ఈ ఫిల్లింగ్ స్టేషన్‌లో పనిచేస్తున్న వారికి ఇప్పటివరకు జీతాలు సక్రమంగా చెల్లించలేదని వారు సంఘానికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.దీనిపై స్పందించిన సంఘం నాయకులు, వెంటనే బకాయి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతూ ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బియ్యం కార్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జవాజీ అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి జక్కని రమేష్, కోశాధికారి ఊరకొండ లత, కార్యవర్గ సభ్యులు మరియు బాల మహేష్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా

# పోలీసు మహిళలకు సన్మానం



**వాస్తవం : ఎల్లారెడ్డిపేట:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసు సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం ఎల్లారెడ్డిపేట ఎస్ఐ కే. రాహుల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుళ్లు హేమలత, మమతతో పాటు హోం గార్డ్ అనసూయలను ఎస్ఐ రాహుల్ రెడ్డి శాలువాలు కప్పి సన్మానించారు.ఈ సందర్భంగా ఎస్ఐ రాహుల్ రెడ్డి మాట్లాడుతూ మహిళా పోలీసులు తమ పూర్తి శక్తి సామర్థ్యా లతో విధులు నిర్వహిస్తూ లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ విధులు, రైటర్ పనులు, సైబర్ వారియర్స్ కార్యక్రమాల ద్వారా పాఠశాలల్లో సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించడం వంటి బాధ్యతలను మహిళా పోలీసులు సమర్థంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా ముఖ్యమైన బందో బస్తు బాధ్యతలను కూడా మహిళా సిబ్బంది విజయవంతంగా నిర్వహిస్తు న్నారని అన్నారు. గృహహింస, వైవాహిక వివాదాల వంటి కేసుల్లో బాధిత మహిళలకు కౌన్సిలింగ్ అందిస్తూ మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

## ముదిరాజులు రాజకీయంగా

# అభివృద్ధి చెందాలి

**కొట్టాల యాదగిరి**



**మార్కుక్, వాస్తవం:** ముదిరాజ్ సమాజం రాజకీయంగా మరింత బలోపేతం కావాలంటే ఐకమత్యం అవసరమని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో నూతనంగా ఎన్నికైన ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ,కార్యవర్గ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ సమాజానికి చెందిన నాయకులు వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్నప్పటికీ, వారి గెలుపు కోసం సమాజం మొత్తం కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. స్థానిక సంస్థల నుంచి రాష్ట్ర స్థాయి రాజకీయాల వరకు ముదిరాజులకు సముచిత ప్రాతినిధ్యం రావాలంటే ఐక్యతతో ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు కోయిల కనకయ్య, ప్రధాన కార్యదర్శి రమేష్, కార్యదర్శి కనకయ్య, సంయుక్త కార్యదర్శి స్వామి, నాయకులు తోట కృష్ణ, పోయిల మల్లేశం, తోట సాయిలు, తోట సత్యం, దేశమైన కనకయ్య, గుర్రాల నరేష్, పోయిల జాంగిరి, కొంతం కనకయ్య, గుర్రాల భాను, పోయిల సత్యనారాయణ, గుర్రాల కుమార్, తోట గణేష్ తదితర ముదిరాజ్ సభ్యులు పాల్గొన్నారు.

# శివకళ్యాణ మహోత్సవాల్లో మహన్యాస పూజ



**వాస్తవం : వేములవాడ** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న శివకళ్యాణ మహోత్సవాల్లో భాగంగా 4 వ రోజు ఆదివారం పూజా కార్యక్ర మాలు ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా స్వామివారికి మహన్యాసం నిర్వహించారు. అనంతరం పరివార దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. తరువాత ఔపాసనం, బలిహరణం, రుద్ర హోమం, ఏకాదశ హోమం, ఏకాదశ కల్ప నాపన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం వైభవంగా జరగనుంది. అనంతరం ఔపాసనం, బలిహరణం కార్యక్రమాలు నిర్వహించి, రాత్రి శృంగార వసంతోత్సవం నిర్వహించనున్నారు.రాజన్న ఆలయం అభివృద్ధిలో భాగంగా ఆలయ అర్చకులు, వేద పండితులు, జంగమ అర్చకులు "వీరభద్ర... శరభ శరభ... శివ శివ..." అంటూ ఘనంగా మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ఏకాంతంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.




వాస్తవం



# మహిళలే అభివృద్ధికి మూలస్తంభాలు

## సర్పంచ్ కొండల్ రెడ్డి



**మార్కుక్, వాస్తవం :**

సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని అంగడికిష్టాపూర్ గ్రామ సర్పంచ్ కొండల్ రెడ్డి అన్నారు. ఆదివారం మహిళా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని అంగడి కిష్టాపూర్ గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామంలో వివిధ హోదాలో పనిచేస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు కుటుంబ వ్యవస్థను ముందుకు నడిపించడంలోనే కాకుండా సామాజిక, రాజకీయ రంగాల్లో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబంలో తీసుకునే నిర్ణయాల నుంచి గ్రామ అభివృద్ధి కార్యక్రమాల వరకు మహిళల సూచనలు, భాగస్వామ్యం ఎంతో ప్రభావవంతంగా ఉంటాయని తెలిపారు. మహిళలు చైతన్యవంతంగా ముందుకు వస్తే గ్రామాలు అభివృద్ధి చెందడమే కాకుండా సమాజం మొత్తం పురోగమిస్తుందని అన్నారు. ఇటీవలి కాలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు రావడంతో గ్రామ పాలనలో మహిళల భాగస్వామ్యం పెరిగిందని, వారు సమర్థంగా బాధ్యతలు నిర్వర్తిస్తూ మంచి పరిపాలనకు తోడ్పడుతున్నారని తెలిపారు. మహిళలు విద్య, ఉపాధి, స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా బలపడితే కుటుంబాలు మరియు గ్రామాలు మరింత అభివృద్ధి సాధిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేష్ గౌడ్, మాజీ సర్పంచ్ రాములు గౌడ్, గ్రామ నాయకులు దుద్దెడ నరసింహులు గౌడ్, పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్, మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామ మహిళలు పాల్గొన్నారు. మండలంలో ఆయా గ్రామాల్లో మహిళ ప్రజా ప్రతినిధులను గ్రామస్థాయిలో వివిధ హోదాలో పనిచేస్తున్న మహిళ అధికారులను సేవలను గుర్తు చేస్తూ ఘనంగా సన్మానించారు.

# శాత్రాజ్‌పల్లిలో ఘనంగా మహిళా దినోత్సవం



**వాస్తవం : వేములవాడ**

వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజ్‌పల్లి గ్రామంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికులను మున్సిపల్ 2 వ వార్డ్ కౌన్సిలర్ ఏనుగు జ్యోతి– తిరుపతిరెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించి వారి సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఏనుగు జ్యోతి మహిళా పారిశుధ్య కార్మికులకు బహుమతిగా చీరలను అందజేసి అభినందించారు. మహిళల సేవలు సమాజానికి ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

## మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి



**వాస్తవం : అందోల్**

మహిళలు అన్ని రంగాలలో రాణించాలని అప్పుడే వారి వారి ఇంటిని సరిదిద్దుకుంటారని అందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జోగిపేట ఏరియా ఆసుపత్రిలో మహిళా దినోత్సవం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని తెలిపారు. మహిళలకు పూర్తి స్థాయి రక్షణ కల్పించాలని తెలిపారు. మహిళలకు పురుషులతో సమానంగా హక్కు కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బాలికలకు వ్యాక్సిన్ కార్యక్రమం చేపట్టారు. ఆయన బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు మహిళా కౌన్సిలర్లు ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సౌజన్య మున్సిపల్ సిబ్బంది ఏరియా హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అట్లేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో

# ఘనంగా మహిళా దినోత్సవం



**వాస్తవం :శేరిలింగంపల్లి**

అట్లేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్లేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో ఆర్‌బీఆర్ కాంప్లెక్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కాలనీ మహిళలు మరియు పిల్లల కోసం పలు వినోదాత్మక ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ హాజరై మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వాటర్ బాటిల్ ఫిల్లింగ్, మ్యూజికల్ చైర్, ప్రొటెక్ట్ యువర్ బెలూన్, టగ్ ఆఫ్ వార్ వంటి ఆటలు నిర్వహించగా మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 5000 విలువైన గిఫ్ట్, ద్వితీయ బహుమతిగా రూ. 3000 విలు వైన గిఫ్ట్ పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు కూడా ప్రకటించా రు. ఈ కార్యక్రమంలో సుమారు 500 కి పైగా కాలనీ సభ్యులు, మహిళలు, పిల్లలు మరియు ఏ ఆర్ పి టీమ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన వారందరికీ భోజన ఏర్పాట్లు కూడా చేశారు. అందరి సహకారంతో ఆర్‌బీఆర్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

# ఘనంగా మహిళా దినోత్సవం

## హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వాస్తవం : వేములవాడ**

వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పట్టణంలోని త్రినేత్ర ఫంక్షన్ హాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. మహిళ దినోత్సవం పునస్కరించుకొని మహిళల కోసం ముగ్గుల పోటీలు, ఆటల పోటీల తోపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ పుల్కం రాజు పాల్గొన్నారు.

# హత్య కేసును ఛేదించిన పోలీసులు

## ముగ్గురు నిందితుల అరెస్ట్

**వాస్తవం : వేములవాడ**

వేములవాడ పట్టణంలోని సిద్ధార్థ కాంప్లెక్స్ లాడ్జిలో జరిగిన భూక్య మోహన్ హత్య కేసును పట్టణ పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలు బైరి శారద అలియాస్ కళ్యాణితో పాటు ఆమె భర్త బైరి శేఖర్, సహకరించిన గుండం రవి(రవీందర్)లను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. వేములవాడ అంజనీనగర్‌లో నర్సుగా పనిచేస్తున్న శారద కు మృతుడు భూక్య మోహన్ కు మధ్య అక్రమ సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో మోహన్ తరచూ డబ్బులు కావాలని శారదను వేధించడమే కాకుండా వారిద్దరు కలిసి ఉన్న ఫోటోలు, వీడియోలను బయటపెడతానని బెదిరించసాగాడు. ఈ వేధింపులు భరించలేక శారద తన భర్త శేఖర్ తో కలిసి మోహన్‌ను వదిలించుకోవాలని పథకం రచించింది. ఈ క్రమంలో గుండం రవి అనే వ్యక్తి సహాయం తీసుకున్నారు. ఈ నెల 4 న శారద పథకం ప్రకారం మోహన్‌ను సిద్ధార్థ కాంప్లెక్స్‌కు పిలిపించింది. అక్కడికి చేరుకున్న శేఖర్, రవి లు కలిసి నైలాన్ తాడుతో మోహన్ గొంతు నులిమి హత్య చేశారు. నిందితుల కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు తిప్పాపూర్ బస్‌స్టాండ్ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన బైక్, నైలాన్ తాడు , చాకును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయ మూర్తి రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరితగతిన ఛేదించి నిందితులను పట్టుకున్న వేములవాడ టౌన్ సిఐ వీర ప్రసాద్, ఎస్ఐ లు రామ్మోహన్, ప్రేమానందం, పిసి లు ఇమ్రాన్, సల్మాన్, శ్రీనివాస్‌లను వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందించారు.



# 14-15 వయస్సు బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**సిరిసిల్ల జీ జీ హెచ్‌లో హెచ్ పీ వీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభం**

**వాస్తవం: సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 14- 15 ఏండ్ల వయసులోపు బాలికలకు హెచ్ పీ వీ వ్యాక్సిన్ వేయించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు హెచ్ పీ వీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారంభించారు. గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు 14 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల లోపు బాలికలకు వ్యాక్సిన్‌లు వేశారు. అనంతరం వారికి వాక్సినేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ .... గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు 14 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలలోపు బాలికలకు ఆడపిల్లల తల్లిదండ్రులు బాధ్యత వహించి హెచ్ పీ వీ వ్యాక్సిన్ తప్పక ఇప్పించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 3, 773 మంది బాలికలను గుర్తించారని, బాలికల తల్లిదండ్రులు గుర్తింపు కార్డుతో వచ్చి వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి, ఎల్లారెడ్డిపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ పంపిణీ మొదలు పెట్టామని తెలిపారు.

**మహిళా దినోత్సవ వేడుకలు**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్ రజిత, జీ జీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా,జిల్లా వ్యాధిని రోధక టీకాల అధికారి డాక్టర్ సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# జీవితంపై విరక్తి చెంది గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

**వాస్తవం : ధర్మారం :**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బంజారపల్లి తండా గ్రామానికి చెందిన భుక్యా దేలు,(48)సం మూడు సంవత్సరాల క్రితం యాక్సిడెంట్ వలన, దాని వల్ల వచ్చే నొప్పి భరించలేక సరిగా నడవలేక పోవడం వలన తను జీవితం పై విరక్తి చెంది గడ్డి మందు తాగినాడు అతనిని కరీంనగర్ లోని వన్ హాస్పిటల్ తీసుకొని వెళ్ళినారు చికిత్స పొందు తూ ఆదివారం రోజున మరణించినాడు అతని భార్య అయినా భుక్యా లక్ష్మి, మృతుడికి ఇద్దరు కుమారులు సంతానం కలదు, భుక్యా లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మారం ఎస్సై ఏం ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# ఘనంగా మహిళా దినోత్సవం

**-దేవి రాజలింగు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం**



**వాస్తవం: ధర్మారం**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రోజున అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారం మండల కేంద్రంలో మహిళ క్యాంటీన్ లో మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బిజెపి మండల ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో, దేవి రాజలింగు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది, ముఖ్య అతిథులుగా,మేడవేణి శ్రీనివాస్, బాల్ రెడ్డి, గడ్డం రాజేశ్వర్ రెడ్డి, విద్య మారి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**వాస్తవం : చందుర్తి**



చందుర్తి మండల కేంద్రంలో స్థానిక గ్రామపంచాయతీ సర్పంచ్ పులి సత్యం గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం అంతరాజ్తీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగురాలి ఎంపీడీవో రాదను సర్పంచి పులి సత్యయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాధ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని చందుర్తి మండల కేంద్రంలో గ్రామపం చాయతీ కార్యాలయంలో సర్పంచ్ పులి సత్యం గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయం అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అప్పుడే మహిళలకు గౌరవం పెరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీ మహిళ కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ బత్తుల కాంతి, అంగన్ ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, వివోలు పాల్గొన్నారు.

**స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో**

# మహిళా దినోత్సవం



**వాస్తవం: చందుర్తి**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని చందుర్తి మండలం మల్యాల గ్రామం లోని స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ గ్రామ సర్పంచ్ మందాల శారద , మహిళా పాలకవర్గ సభ్యురాల్లు పత్తిపాక లావణ్య, అర్వం అనూష, ఈసరి శిల్ప, పాటి రేణుక, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యురాలు పీసరి మంజుల, అంగన్ వాడీ ఉపాధ్యాయురాలు ద్యావనపల్లి జ్యోతి, తూమ్ అనిత, మేకల సుజాత, సంటి సంధ్య , మహిళా సంఘ సిఏ మల్యాల రజిత, జిందం గంగ, పిట్ల సువర్ణ, ఆశా కార్యకర్తలు గొర్రె మంజుల, పారిశుద్ధ మహిళా కార్మికురాలు నేదూరి దేవవ్వ, కట్కూరి మల్లవ్వలను శాలువాతో ఘనంగా సన్మానించి వారి సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద సేవా సమితి సభ్యులు బొడ్డు కృష్ణ, లోకోజి సతీష్ కుమార్, పాటి సుధాకర్, పంచర్పుల దివ్యసాగర్,పత్తిపాక శ్రీనివాస్,కొడగంటి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో మహిళలు ఆత్మవిశ్వాసంతో సాగాలి

**వాస్తవం : చిగురుమామిడి:**



అన్ని రంగాల్లో మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని పలువురు నాయకులు అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మహిళా సర్పంచ్,వార్డు మెంబరులు, ఆశా కార్యకర్తలు,అంగన్వాడీ టీచర్లు, మహిళా సంఘాల సిఎలు గ్రామ పంచాయతీ మహిళా సిబ్బందిని గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గూల్ల రజిత రాజు,ఉప సర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,వార్డు మెంబర్లు బోయిని వేణు గోపాల్,పిల్లి తిరుపతి, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ మహిళలు ముఖ్యంగా ఉద్యోగాలు,వ్యాపారాల ద్వారా ఆర్థిక సాధికారత సాధించాలన్నారు. రాజకీయ రంగంతో పాటు అన్ని రంగాల్లో నాయకత్వ బాధ్యతలను చేపట్టి సమాజంలో ఆదర్శంగా నిలవాలన్నారు. మహిళలు ఉన్నత విద్య అభ్యసించి సమాజంలో గుర్తింపు పొందుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరులు,ఆశా కార్యకర్తలు,అంగన్వాడీ టీచర్లు,మహిళా సంఘాల సిఎలు,గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.




# మహిళల సాధికారతే సమాజ ప్రగతికి మార్గం

**10వ వార్డులో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు**

**- కౌన్సిలర్ కోట బాపురాజు**

**వాస్తవం, గజ్వేల్ ఆర్ సి :**



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధి లోని 10వ వార్డు వేములగట్టు అంగన్వాడీ కేంద్రంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ కోట బాపురాజు పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టికి మూలమైన స్త్రీ మూర్తులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు ప్రపంచానికే స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. విద్య, వైద్యం, రాజకీయాలు, వ్యాపారం, క్రీడలు తదితర అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహించడంతో పాటు ఉద్యోగులుగా, ప్రజాప్రతినిధులుగా మహిళలు తమ సత్తాను చాటుతున్నారని తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు విశ్రాంతి లేకుండా కుటుంబాన్ని చూసుకుంటూనే సమాజానికి సేవలు అందిస్తున్న మహిళల త్యాగస్ఫూర్తి ప్రశంసనీయమని కొనియాడారు. మహిళలు బాగుంటేనే ఆ కుటుంబం, రాష్ట్రం, దేశం బాగుంటుందని ఆయన అన్నారు. మహిళలకు గౌరవం, సమాన అవకాశాలు కల్పించి నప్పుడే సమాజం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. ఎక్కడ స్త్రీలు పూజించబడుతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు అనే మన సంస్కృతి గొప్పతనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని టీచర్లు నాగమణి, పద్మా, భాగ్యలక్ష్మి, ఆయమ్మ యాదవ్వలకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. మహిళ సేవలను కొనియాడుతూ వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బిక్షపతి, కనకయ్య, చరణ్‌పాల్గొన్నారు.

# నాచగిరిలో ఆధ్యాత్మిక సంబురానికి శ్రీకారం

**- నాచగిరి క్షేత్ర గిరిప్రదక్షిణ పూర్వజన్మ సుకృతం**

**- వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టిన స్వామీజీ**

**- శ్రీ నృసింహ నామస్మరణతో మార్మోగిన నాచగిరి కొండలు**

**- హాజరైన గురు మదనానంద పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి**

**వాస్తవం, గజ్వేల్ ఆర్ సి :**





తెలంగాణ జిల్లాల్లో సుప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా వెలుగొందుతున్న నాచగిరి శ్రీ లక్ష్మీ నృసింహ క్షేత్ర గిరి ప్రదక్షిణ పూర్వ జన్మ సుకృతమని, లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్న ఈ మహత్కార్యంలో పాల్గొన్న భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి దక్కుతుందని శ్రీ గురు మదనానంద పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామీజీ ఉద్బోధించారు. ఆదివారం నాచగిరి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని చైర్మన్ రవీందర్ గుప్త ఆధ్వర్యంలో ప్రారంభించగా, ఆలయ అధికారి బెల్లంకొండ రంగాచారి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ మోహన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం స్వామీజీ భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ శ్రీ నారసింహుడు నడయాడిన ఈ ప్రాంతం ఎంతో పవిత్రమైనవని, దర్శిస్తే సర్వపాపాలు తొలగి ముక్తికి మార్గం దక్కుతుందని అన్నారు. స్వామివారి జన్మ నక్షత్రశ్రీ స్వాతి నక్షత్రం పురస్కరించుకొని వైకుంఠ ద్వారం నుండి గిరి ప్రదక్షిణ చేయడం పుణ్యకార్యమని, చక్కటి ఫలితాలిస్తుందని, భగవన్నామ స్మరణతో మానసిక ప్రశాంతత దక్కుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం దిగ్విజయంగా జరగాలని స్వామీజీ ఆకాంక్షించారు. సనాతన ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక చింతన, ధార్మిక భావన తదితర గుర్తు చేస్తుండగా, ఈ సంస్కృతి వారసత్వాన్ని ప్రతి ఒక్కరూ స్వీకరించాలని కోరారు. పరమేశ్వరుడి కృప, భగవంతునిపై భక్తి, సేవాభావం, మనో నిగ్రహం, దాతృత్వం, ధర్మబద్ధమైన జీవనం తదితర మానవుడిని సన్మార్గంలో నడిపించ నుండగా, పుణ్యక్షేత్రాలు, పురాతన ఆలయాలు, గోసంపద తదితర రక్షించుకునే బాధ్యతను మర్చిపోవద్దని వివరించారు. ఈ కార్యక్రమాల్లో ట్రస్టు బోర్డు సభ్యులు ఉషశ్రీ రాజశేఖర శర్మ, చందా నాగరాజు గుప్త, జగ్గయ్యగారి శేఖర్ గుప్త, శ్రీనివాస్, రుద్ర శ్రీహరి, గాలి కిష్టయ్య, సురేందర్ రెడ్డి, కర్రె పద్మ వెంకటేష్, సర్పంచ్లు సారిక యాదగిరి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వేద పండితుల మంత్రోశ్ఛరణల మధ్య స్వామీజీ నాచగిరి వార్షిక బ్రహ్మోత్సవాలకు జ్యోతి ప్రజ్వలనతో అంకురార్పణ చేశారు. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ, మహా ప్రసాదం అందజేశారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక

**వాస్తవం: సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఉన్నతాధికారులు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో పాల్గొని విజయవంతం చేయడానికి అధికారులు విజయవంతం కావడానికికృషి చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో 26 మండలాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్ర మాన్ని చేపదుతున్నారు. ప్రధానంగా 10 అంశాలు ప్రతిపా దించబడ్డాయి 1) పరిసరాల పరిశుభ్రత మరియు ప్రభుత్వ కార్యాలయాల్లో పైళ్ళ పరిష్కారం 2) ఆరోగ్యం 3) సురక్షితంగా చేసుకోండి 4) సంక్షేమం 5) పిల్లల భద్రత మరియు రక్షణ మరియు డ్రగ్స్ నో 6) రైతులు వ్యవసాయం 7) విద్య 8) యువత మరియు క్రీడలు 9) మహిళలు 10) పర్యావర ణం వంటి కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది. ఇట్టి కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# చర్లలో ఎఫ్ఎల్ఎన్ బాలమేళా

**కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ పరిటాల వెంకటరమణ**




**చర్ల : వాస్తవం**

ఎఫ్ ఎల్ ఎన్ బాలమేళ కార్యక్రమాన్ని మండల కేంద్రం లోని ఎంఈఓ పరిటాల వెంకటరమణ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో నిర్వహించారు .బాలమేళా కార్యక్రమం ప్రాథమిక పాఠశాల విద్యార్థులలో, ముఖ్యంగా 1–3 తరగతుల పిల్లలలో చదవడం, రాయడం, మరియు గణిత నైపుణ్యాలను (పునాది అక్షరాస్యత మరియు సంఖ్యాశాస్త్రం) సరదా ఆటల ద్వారా పెంపొందించ డానికి నిర్వహించే ఒక సమగ్ర వేడుక. విద్యార్థులు లక్ష్యాలకు అనుగుణంగా, తల్లిదండ్రులు మరియు సమాజ భాగస్వామ్యంతో పిల్లల అభ్యాసాన్ని ప్రోత్సహించడానికి ఈ మేళాలను తరచుగా నిర్వహిస్తామని మండల ఎంఈఓ పరిటాల వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా పరిటాల వెంకటరమణ మాట్లాడుతూ పిల్లలు చదవడం, రాయడం మరియు సంఖ్యలను ఆటల ద్వారా నేర్చుకుంటారని ఇది అభ్యాసాన్ని ఆనందదాయకంగా మారుస్తుందని పిల్లల అభ్యాస ప్రక్రియలో తల్లిదండ్రులను నేరుగా భాగస్వాములను చేయడం, వారి అవగాహనను పెంచడం దీని ముఖ్య ఉద్దేశ్యని తెలిపారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**వాస్తవం, దౌల్తాబాద్, మార్చి 8:**

దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు లక్ష్మి నారాయణ కుమారుని వివాహ వేడుకకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా, మండల ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు గడ్డం నాగరాజు, మాజీ ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రమేష్ గౌడ్,లక్ష్మీనారాయణ,రాజనర్సు,స్వామి, సర్పంలు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన మహిళల ద్వారా

# ఆరోగ్యవంతమైన సమాజం

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మార్చి 8 (వాస్తవం)**

ఆరోగ్యవంతమైన మహిళల ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఈ క్రమంలో 14 నుంచి 15 సంవత్సరాల వయస్సులో ఉన్న బాలికలు హెచ్‌పీవీ ( హెచ్ పి వి) వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో గల మాతా శిశు సంరక్షణ కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. అనిత, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సంచాలకులు డా. వేదవ్యాస్ తదితర అధికారులతో కలిసి హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో 99 రోజులపాటు ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14 సంవత్సరాలు నిండిన బాలికలకు ఈ వ్యాక్సిన్ అందజేయడం జరుగుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులకు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యా శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖలు కలిసి మహిళా సంఘాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులను నివారించడంలో ఈ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా ఈ వ్యాక్సిన్ బాలికలకు అందించడం ద్వారా రేపటి తరాలు ఆరోగ్యంగా ఉండగలవని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. జిల్లాలో మొత్తం 8,150 మంది బాలికలకు వ్యాక్సిన్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని మాతా శిశు ఆసుపత్రి, బెల్లంపల్లి, లక్షెట్టిపేట్, చెన్నూర్ ప్రాంతాల్లోని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా వ్యాక్సిన్ అందించనున్నట్లు చెప్పారు. నస్పూర్‌లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జిల్లా మైనారిటీ సంక్షేమ బాలికల పాఠశా లలో చదువుతున్న 30 మంది విద్యార్థినులకు ఇప్పటికే వ్యాక్సిన్ అందించినట్లు తెలిపారు. అనం తరం కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రాలు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు బాలాజీ, ఆర్ఎంఓలు భీష్మ, శ్రీధర్, డిపిఓ ప్రశాంతి, ఆర్ఎస్ పద్మ, అల్లాడి శ్రీనివాస్, కాకిరాల వెంకటేశ్వర్లు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, స్థానిక కార్పొరేటర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# మహిళలకు

# కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది

**- గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి**

**- గజ్వేల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు**

**- మహిళలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలం**

**- కేసీఆర్ హయాంలో మహిళలకు పెద్దపీట**

**- మహిళా నాయకురాళ్లకు శాలువాలతో సన్మానం**



**వాస్తవం, గజ్వేల్ ఆర్ సి :**

మహిళలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆరోపించారు. కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. చదువుకున్న ప్రతి విద్యార్థినికి స్కూటీలు ఇస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు రూ.2500 ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సృష్టికి మూలమైన స్త్రీ మూర్తులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు బాగుంటేనే ఆ కుటుంబం, రాష్ట్రం, దేశం బాగుంటుందని అన్నారు. ఎక్కడ స్త్రీలు పూజించబడుతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు అనే మన సంస్కృతి గొప్పతనాన్ని గుర్తు చేశారు. సమాజంలో మార్పు తీసుకురావడంలో మహిళల పాత్ర కీలకమని, వారు అన్ని రంగాల్లో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోరారు. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. సమైక్య పాలనలో తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేసిన రోజులు ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గోదావరి జలాలతో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించి మహిళలను ఆ సమస్యల నుంచి విముక్తి కల్పించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని అన్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగ్ రావు, మహిళా కౌన్సిలర్లు, బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, కౌన్సిలర్లు గోలి మమతా సంతోష్, బొగ్గుల స్వప్న సురేష్, మన్నెరూప వెంకటేష్, కప్ప మమత పోచయ్య, కొలిచెల్మి భవానీ కరుణా కర్, కోట బాబు, ఫర్జానా బేగం, రజియా బేగం, నాయకులు గుం టూకు రాజు, రమేష్, అహ్మద్, పాల రమేష్ గౌడ్, హనుమంత్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు స్వామి పాల్గొన్నారు.

# ఆదివాసి టీచర్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**చర్ల : వాస్తవం**

చర్ల మండలంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏ టీ ఏ) ఆధ్వర్యంలో ఆదివాసీ మహిళా దినోత్సవాన్ని ఆటపాటల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేశ ధనలక్ష్మి బెండబోయిన సరోజిని అధ్యక్షత వహించారు. ఇటీవల ఎన్నికైన మహిళా సర్పంచ్ సోయం నాగలక్ష్మిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులు, మహిళలు సాంస్కృతిక కార్యక్రమంలో ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఏ టి ఏ మండల అధ్యక్షుడు శ్యామల రామారావు, ఏ టి ఏ రాష్ట్ర నాయకులు బీ.సత్యనారాయణ పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఏ టి ఏ మండల జనరల్ సెక్రటరీ తోకల లక్ష్మీపతి మాట్లాడుతూ మహిళల ప్రతిభ, ఓర్పు, నేర్పు, త్యాగం, ప్రేమ వంటి విలువల వల్లే కుటుంబం సంతోషంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, వారికి తగిన గౌరవం, మద్దతు, స్వేచ్ఛ కల్పించినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని అన్నారు. అలాగే మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.దేశ తులసిరాం



మాట్లాడుతూ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పి. జీవనజ్యోతి, బి. శారద, కె. హైమావతి, కె. సుగుణ,కె. నిర్మల, పి. అరుణ, పి. బుచ్చిరాజు, ఎస్.శేషు,కె.రాజబాబు, ఎం. రాజ కుమార్ ఎం.సరిత పాల్గొన్నారు.

# అకాల మరణం చెందిన ఉపాధ్యాయునికి ఆర్థిక సాయం

**వాస్తవం : మరిపెడ**

మండలంలోని కస్న తండ ప్రాథమిక పాఠశాలలో యస్జీటిగా విధులు నిర్వహిస్తున్న బీమా గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ పిఆర్టియుటిఎస్ సభ్యుడు గుగులోత్ భీమా కుటుంబాన్ని ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి పరామర్శించారు. ఆదివారం దశదిన కర్మ సందర్భంగా మరిపెడలోని వారి స్వగృహాన్ని సందర్శించిన ఆయన మృతునికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం పి ఆర్ టి.యు.టి.ఎస్ సంఘం తరపున ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయ చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ పి ఆర్ టి యు



టి ఎస్ సభ్యత్వం ఒక రక్షణ కవచం లాంటిదని, సభ్యులు సేవలో ఉన్నంత కాలం మాత్రమే కాకుండా, వారి మరణానంతరం కూడా సంఘం కుటుంబాలకు అండగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు ఆడిట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మరిపెడ మండల అధ్యక్షులు కీసర రమేష్ రెడ్డి ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్,గౌరవ అధ్యక్షులు గుగులోత్ అర్జున్,మాజీ అధ్యక్షులు వెరమ రెడ్డి నర్సింగ్, రాష్ట్ర నాయకులు దోమల లింగన్న, అబ్బూరి సునీల్ కుమార్, రాయిపల్లి యాకయ్య, పి.సరోజ,గుర్రం వెంకన్న,గుగులోత్ వెంకన్న, మంగీ లాల్,,శ్రీను, లింగయ్య,వినోద్, వెంకటేశ్వర్లు,హీరాలాల్, గణేష్,అనురాధ, మహేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# సిరిసిల్లలో వ్యక్తి ఆత్మహత్య



**వాస్తవం: సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆదివారంవిషాదం చోటు చేసుకుంది. సిరిసిల్ల పట్టణంలోని 24 వ వార్డుకు చెందిన నల్ల రామకృష్ణ (52) అనే వ్యక్తి చంద్రంపేటలోని స్థానిక ఈధుల చెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు. అందిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహానికి పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## చందుర్తి పోలీస్ స్టేషన్‌లో మహిళా దినోత్సవం



**వాస్తవం: చందుర్తి :** చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఎస్ ఐ జిల్లెల్ల రమేష్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. చందుర్తి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ సిరి వెన్నెల ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ జిల్లెల్ల రమేష్ మాట్లాడుతూ...సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. నేటి కాలంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, ముఖ్యం గా పోలీస్ శాఖలో సవాళ్లను ఎదుర్కొంటూ శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించడం అభినందనీయమని పేర్కొన్నారు. మహిళా సిబ్బంది అంకితభావం తోటి ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళను సన్మానించిన పుస్తకాల కవిత

**వాస్తవం : జూబ్లీహిల్స్:**

నేషనల్ మహిళా అధ్యక్షురాలు అల్కా లాంబ ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మొగిలి సునీత సూచనలతో తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత సమక్షంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్లో మహిళా దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తన భుజాన వేసుకొని తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించారు. సికింద్రాబాద్ యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ, ఏజీ కాలనీ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇంచార్జ్ మనోజ్ . ఈ కార్యక్రమంలో వెంగళరావు డివిజన్ మహిళా అధ్యక్షురాలు బెజ్జం రాణి తన టీమ్ మహిళలను తీసుకొని వచ్చి మహిళా దినోత్సవ వేడుకలలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి మహిళకి శాలువాతో ఘనంగా సన్మానించారు పుస్తకాల కవిత. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కేకును మహిళల మధ్య కట్ చేసి జై కాంగ్రెస్,జై సోనియమ్మ,జై రేవంత్ రెడ్డి అని గట్టిగా



పిలుపునిస్తూ ప్రతి ఒక్కరికి అంత ర్జాతీయ మహిళా దినోత్సవ శుభా కాంక్షలు తెలిపారు.

# శాంసన్, బుమ్రా దెబ్బకు కుదేలైన న్యూజిలాండ్..

**మూడోసారి టీ20 ఛాంపియన్‌గా భారత్**

డిఫెండింగ్ ఛాంపియన్ భారత జట్టు చరిత్ర సృష్టించింది. స్వదేశంలో సంపూర్ణ ఆధిపత్యంతో రికార్డు స్థాయిలో మూడోసారి టీ20 ప్రపంచకప్‌ను కొల్లగొట్టింది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో అసలైన ఆటతో న్యూజిలాండ్‌ను చిత్తుగా ఓడించింది టీమిండియా. ఓపెనర్లు సంజూ శాంసన్(89), అభిషేక్ శర్మ(52), ఇషాన్ కిషన్(54)ల మెరుపులతో ప్రత్యర్థిని సగం దెబ్బ తీసిన సూర్యకుమార్ యాదవ్ సేన.. బుమ్రా(4-15), అక్షర్ పటేల్(3-27) సంచలన బౌలింగ్‌తో పడగొట్టింది. పరుగు విజయంతో పొట్టి కప్‌లో మరే ఆతిథ్య జట్టుకు సాధ్యపడని విధంగా ప్రపంచకప్‌ను పట్టేసింది. ఈ విక్టరీతో కివీస్ ఫోబియాను.. నరేంద్ర మోడీ స్టేడియంలో ఫైనల్ భయాన్ని భారత్ అధిగమించింది. స్వదేశంలో టీ20 ప్రపంచకప్‌లో ఫేవరెట్‌గా అడుగుపెట్టిన భారత్ ఛాంపియన్‌గా మురిసిపోయింది. లీగ్ దశను అజేయంగా ముగించి.. సూపర్ 8 తొలి మ్యాచ్‌లోనే దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఓడిన టీమిండియా అద్భుతంగా పుంజుకుంది. సంజూ శాంసన్(89) మెరుపులతో సెమీస్‌లో ఇంగ్లండ్‌ను చిత్తు చేసిన సూర్యకుమార్ యాదవ్ సేన ఫైనల్లోనూ పంజా విసిరింది. 255 పరుగులతో న్యూజిలాండ్‌ను భయపెట్టిన భారత జట్టు.. బౌలింగ్‌లోనూ ఇరగదీసింది. బుమ్రా(4-15), అక్షర్ పటేల్(3-27) విజృంభణతో ఆరంభం నుంచి వికెట్లు కోల్పోయిన కివీస్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు.

**అక్షర్ మ్యాజిక్**

ప్రపంచకప్ ఫైనల్లో భారత్ నిర్దేశించిన రికార్డు ఛేదనలోన్యూజిలాండ్ తడబడింది. పవర్ ప్లేలోనే బంతి అందుకున్న అక్షర్ పటేల్(2-18) తొలి ఓవర్లోనే డేంజరస్ ఫిన్ అలెన్(9)ను ఔట్ చేసి బ్రేకిచ్చాడు. ఆ తర్వాతి ఓవర్లో.. సిక్సర్ బాదిన గ్లెన్ ఫిలిప్స్(5)ను క్లీన్‌బౌల్డ్ చేసి కివీస్‌కు మరో షాకిచ్చాడీ ఆల్‌రౌండర్. అంతకుముందు ఓవర్లో బుమ్రా ఫైనల్ లెగ్ దిశలో బంతిని గాల్లోకి లేపిన రచిన్ రవీంద్ర(1)ను ఇషాన్ డైవింగ్ క్యాచ్‌తో పెవిలియన్ పంపాడు. పవర్ ప్లేలోనే మూడు బిగ్ వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్‌ను ఓపెనర్ టిమ్ సీఫర్ట్(52), మార్క్ చాప్‌మన్(3)లు ఆదుకోవాలనుకున్నా సాధ్యపడలే. వరుణ్ చక్రవర్తి ఓవర్లో సీఫర్ట్‌ను ఇషాన్ బౌండరీ క్యాచ్‌తో డగౌట్ చేర్చగా.. పాండ్యా ఓవర్లో బంతిని వికెట్ల మీదకు ఆడుకున్న చాప్‌మన్ వెనుదిరిగాడు. అంతే.. 72కే సగం వికెట్లు పడడంతో కివీస్ ఓటమి అంచున నిలిచింది. ఆ దశలో కెప్టెన్ మిచెల్ శాంట్నర్(43), డారిల్ మిచెల్(17 ) పరుగుల అంతరం తగ్గించేందుకు పోరాడారు. జేమ్స్ నీషమ్(8)ను స్లో యార్కర్‌తో బుమ్రా బౌల్డ్ చేశాడు. ఆ తర్వాతి బంతికే మ్యాట్ హెన్రీ(0)ని బౌల్డ్ చేసి హ్యాట్రిక్‌పై నిలిచాడు. కానీ.. ఫెర్గూసన్ సింగిల్ తీశాడు. కాసేపటికే అభిషేక్ ఓవర్లో జాకబ్ డఫ్ఫీ చివరి వికెట్‌గా వెనుదిరగడంతో 96 పరుగుల తేడాతో టీమిండియా జయకేతనం ఎగురవేసింది.



**శాంసన్, అభిషేక్ ఊచకోత**

ఫైనల్లో భారత టాపార్డర్ ఊచకోతకు న్యూజిలాండ్ బౌలర్లు బలైపోయారు. ఓపెనర్ అభిషేక్ శర్మ(52) ఫామ్ అందుకుంటూ అర్ధ శతకం బాదేయగా.. హ్యాట్రిక్ హాఫ్ సెంచరీతో సంజూ శాంసన్(89) చెలరేగిపోయాడు. వీరిద్దరి మెరుపులతో కుదేలైన కివీస్ బౌలర్లను ఇషాన్ కిషన్(54) తుఫాన్ ఇన్నింగ్స్‌తో భయపెట్టాడు. జేమ్స్ నీషమ్(3-46) ఒకే ఓవర్లో మూడు వికెట్లతో కాస్త స్కోర్ తగ్గినా.. ఆఖర్లో శివం దూబే(26 నాటౌట్) మెరుపులతో భారత్ నిర్ణీత ఓవర్లలో 255 పరుగులతో కివీస్‌కు రికార్డు లక్ష్యాన్ని నిర్దేశించింది.

# ఓల్డ్ సిటీ కాదు ఒరిజినల్ సిటీ

**ఎన్ని అడ్డంకులొచ్చినా మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం..సీఎం రేవంత్ రెడ్డి**

**అన్యాక్రాంతమైన చెరువులు కుంటల పునరుద్ధరణే మా లక్ష్యం**

**చెరువుల పునరుద్ధరణతో ప్రజల కళ్ళలో ఆనందం**

**వాస్తవం : రాజేంద్రనగర్**

ఓల్డ్ సిటీ గా ఉన్న హైదరాబాద్ నగరాన్ని నిజాం హయాం లో ఉన్న ఒరిజినల్ సిటీ గా రూపుదిద్దడానికి కంకణం కట్టుకున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్ శివరాంపల్లి లోని బమ్-రుక్న్- ఉద్-దౌలా చెరువు ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎమ్మెల్సీ రహమత్ బేగ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, పలువురు అధికారులతో కలిసి పునరుద్ధరణలో భాగంగా చెరువును ప్రారంభించారు. బ్యాటరీ వాహనంలో చెరువు పరిసరాలను, వాకింగ్ ట్రాక్కు, అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రజాప్రతినిధులతో, అధికారులతో కలిసి పరిశీలించారు. హైడ్రా ఈ చెరువులో దాదాపు 45 ఆక్రమణలను తొలగించి 12 ఎకరాల చెరువు భూమిని కాపాడింది. చెరువు పరిసరాలను ఆహ్లాదభరితంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... నిజాం వారసత్వంగా ఉన్న కట్టడాలు చెరువులు, కుంటల పరిరక్షణ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. భవిష్యత్తు తరాలను వరదల నుండి కాపాడాలనే ఉద్దేశంతోనే నిజాం సర్కార్ ఆరోజు ఆలోచించి చెరువుల నిర్మాణాలను చేపట్టిందని గుర్తు చేశారు. అందుకు అనుగుణంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య సూచనతో సుందర నగర నిర్మాణం జరిగిందన్నారు. ఒకవైపు చార్మినార్ మరోవైపు గోల్కొండ, ఫలక్నుమా ప్యాలెస్, పెద్దపెద్ద ఆసుపత్రి భవనాలు ఇలా ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆనాడే రూపకల్పన జరిగిందని చెప్పుకొచ్చారు. అలాంటి నగరంలో ఈరోజు చారిత్రక కట్టడాలు కబ్జాలకు గురవుతూ అన్యాక్రాంతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చారిత్రక కట్టడాలను, చెరువులను, కుంటలను పునరుద్ధరించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వవిఖ్యాతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఓల్డ్ సిటీలో అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే మెట్రో రైల్ ప్రాజెక్టును ప్రారంభించామని సూచించారు. పనులు కూడా మొదలయ్యాయని వెల్లడించారు. మీరాలం ట్యాంక్ పై ఫ్లైఓవర్ నిర్మాణానికి కూడా పునాది పడిందని తెలియజేశారు. చెరువులను ఆక్రమణ నుండి రక్షించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణ అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. బతుకమ్మ కుంటను కాపాడి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని గుర్తు చేశారు. బమ్-రుక్న్-ఉద్-దౌలా 1.5 కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్ నిర్మాణం జరిగిందని పేర్కొన్నారు. ఇక్కడ సేద తీరటానికి వచ్చే ప్రజలకు భద్రతాపరంగా ఎలాంటి ఇబ్బందులు కలగవని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా పోలీసు పెట్రోలింగ్ వ్యవస్థ పటిష్టంగా ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు.






ఈ లేక్ లో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో వాణిజ్య స్టాళ్లకు అధికారులు చర్య లు తీసుకోవాలని కోరారు. దీని ద్వారా మహిళల ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయవచ్చని అన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా మూసీ సుందరీకరణను చేపట్టి తీరుతామని స్పష్టం చేశారు. మూసీ నది ప్రక్షాళనలో భాగంగా అభివృద్ధితో పాటు నైట్ ఎకానమీని ప్రారంభిస్తామని చెప్పారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, చిన్నచిన్న వ్యాపారస్తులకు లబ్ధి చేకూర్చేందుకు తీసుకునే చర్యలను వివరించారు. మూసి ప్రక్షాళనలో భాగంగా ఇండ్లు కోల్పోతున్నవారు అధైర్య పడవద్దు అని ధైర్యం చెప్పారు. ప్రజలను కష్టపెట్టడం మా ఉద్దేశం కాదని బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అక్రమ నిర్మాణాల తొలగింపు సమయంలో కొంతమందికి ఇబ్బంది కలిగి ఉండవచ్చని అన్నారు. కానీ ఇప్పుడు చెరువుల పునరుద్ధరణతో ప్రజల కళ్ళలో ఆనందాన్ని స్పష్టంగా చూస్తున్నానని చెప్పారు.

# రామగుండంలో ఉచిత మెడికల్ క్యాంపు

**రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించిన- ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు, అంతర్గాం మండల సర్పంచులు**

**వాస్తవం : రామగుండం రూరల్**

పెద్దపల్లి జిల్లా ఉచిత ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు అందించిన–మేడి లైఫ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లి వైద్య నిమిత్తం వచ్చిన ప్రజలకు ఉచిత భోజనం అందించిన– డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ కమిటీ సభ్యులు పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం టి టి ఎస్ అంతర్గాం గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ నందు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ సౌజన్యంతో, మిడిల్ లైఫ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సహకారంతో మండలంలోని సుమారు 15 వేల వందల మంది గ్రామ ప్రజలకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్, అంతర్గాం మండల సర్పంచులు ఉచిత వైద్య సేవలు అందించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ అంగోతు రవి కుమార్ నాయక్ మాట్లాడుతూ రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ సౌజన్యంతో,మేడి లైఫ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సహకారంతో మండలంలోని గ్రామ ప్రజలకు సుమారు 15 మంది డాక్టర్ల చేత వివిధ రకాలైన వ్యాధులకు సంబంధిత డాక్టర్లు ఊపిరితిత్తుల పరీక్షలు, గుండె పరీక్షలు, కంటి పరీక్షలు, షుగర్ పరీక్షలు ,స్కానింగ్, వివిధ రకాలైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వాటికి సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. అనంతరం మండలంలోని ప్రజలు వైద్య నిమిత్తం సుమారు 15 వేల వందల మంది రావడంతో వారికి మధ్యాహ్న భోజనం వసతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్టు వారు ఉచితంగా భోజన వసతి కల్పించడం జరిగిందని, ప్రజలకు ఉపయోగపడే విధంగా ఇలాంటి గొప్ప కార్యక్రమం నిర్వహించినటువంటి,దీనికి సహకరించినటువంటి రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్‌కు,డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్‌కు,మేడి లైఫ్ సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్ డాక్టర్ల బృందానికి, అంతర్గాం మండల సర్పంచులకు మండలంలోని గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలపడం జరిగిందని, మేడి లైఫ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారికి కూడా మన అంతర్గాం మండల గ్రామ ప్రజల పక్షాన, మా మండల సర్పంచుల పక్షాన, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్ట్ పక్షాన ,ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని గ్రామ సర్పంచ్ అంగోతు రవి కుమార్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడి లైఫ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ కుమారస్వామి, అంతర్గాం మండల సర్పంచులు, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు, అంతర్గం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బోయ వెంకటస్వామి, మేడి లైఫ్ హాస్పటల్ వైద్య బృందం, వివిధ గ్రామాల





పాలకవర్గం, వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు అంతర్గం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బోయ వెంకటస్వామి, మేడి లైఫ్ హాస్పటల్ వైద్య బృందం, వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వీణ,వానిలను

## ఘనంగా సన్మానించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

**వాస్తవం : జూబ్లీహిల్స్**

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం మధురానగర్ లోని శిశు వికాస్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి మహిళా మనులకు, సిబ్బందికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు అవిభక్త కవలలు వీణ,వాణిలను ఆప్యాయంగా పలకరించి, వారికి నూతన వస్త్రాలు ఇచ్చి,శాలువాతో ఘనంగా సన్మానించారు. వారి విద్యాభివృద్ధి కోసం అవసరమైన 2 స్మార్ట్ ఫోన్లు సి.ఎ. కోచింగ్ కు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,మహిళలు సమాజానికి మూలస్తంభాలని, కుటుంబం నుండి దేశాభివృద్ధి వరకు ప్రతి రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని తన భుజాన వేసుకొని తన వంతు బాధ్యతను సమర్ధంగా పోషించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు లక్ష్మీ సుజాత(



శ్రీనగర్ కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయ మాజీ అధ్యక్షురాలు, సోషల్ వర్కర్).

# అవుర్పల్లిలో పేకాట ఆడుతున్న ఐదుగురు అరెస్ట్

**వాస్తవం : మాడుగుల**

శనివారం అర్ధరాత్రి విశ్వసనీయమైన సమాచారం ప్రకారం ఆవురుపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో గల ఖాళీ స్థలంలో లో కొందరు పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో మాడుగుల పోలీసు వారు అక్కడికి వెళ్లి పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులు 1.కావలి శ్రీను, తండ్రి:రాములయ్య 2.దార్లా నరసింహ తండ్రి: యాదయ్య,3.దార్ల రాజు,తండ్రి:రాములు,4.దార్ల నాగార్జున, తండ్రి:యాదయ్య మరియు తన్నీరు మాధవ్,తండ్రి: సుబ్బారావు లను అట్టి స్థలంలో పేకాట ఆడుతుండగా పట్టుకొని ఇద్దరు పంచుల సమక్షంలో వారి వద్ద ఉన్న



పేకాలు మరియు 900 రూపాయల నగదు,మూడుసెల్ ఫోన్లు సిజ్ చేసి వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నాము అని మాడుగుల సిఐ వేణుగోపాల్‌రావు తెలిపారు.

### బిఆర్ఎస్ అసమర్ధ నాయకత్వం వలనే

# ప్రజలు తిరస్కరించారు..

**హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి**



**వాస్తవం : చిగురుమామిడి:**

కేసీఆర్ కేటీఆర్ హరీష్ రావులు పదేళ్ల పాలనలో తమ జిల్లాలల్లో సాగు నీటి ప్రాజెక్టులు తొందరగా పూర్తి చేసుకున్నారు.కానీ హుస్నాబాద్ మాజీ ఎంఎల్ఎ వొడితల సతీష్ కుమార్ పదేళ్ల అసమర్థ పాలనతో హుస్నాబాద్ గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేయలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు,హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి ధ్వజమెత్తారు.శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ పై మాజీ ఎంఎల్ఎ వొడితల సతీష్ కుమార్ చిగురుమామిడి మండల కేంద్రంలో నిరాధారమైన ఆరోపణలు చేశారన్నారు.చిగురుమామిడి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు.బిఆర్ఎస్ పార్టీ అసమర్థత నాయకత్వం వలనే ప్రజలు మిమ్ములను తిరస్కరించారన్నారు.మాజీ ఎంఎల్ఎ వొడితల సతీష్ కుమార్ పదేళ్ల పాలనలో చిగురుమామిడి సైదాపూర్ మండలాలలో సాగునీటి కాలువల నిర్మాణాల పనులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.బిఆర్ఎస్ ముఖ్య నాయకత్వం వాళ్ళ సొంత జిల్లాల్లోని మల్లన్న సాగర్,రంగనాయక సాగర్ వంటి ప్రాజెక్టులు పూర్తి చేసుకున్నారు.మరి మీరు ఈ ప్రాంతంలోని గౌరవెల్లి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదన్నారు.ఎన్నికల కోసమే పైపైకి పనులు చేశారు తప్ప అభివృద్ధి పనులు చేయలేదని ఎద్దేవాచేశారు.అనంతరం మండల అధ్యక్షుడు హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి మాట్లాడుతూ మాజీ శాసన సభ్యుడు వొడితల సతీష్ కుమార్ చేసిన ఆరోపణలు అర్థంలేనివన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కట్టించిన ఎల్లంపల్లి మిడ్ మానెర్ ప్రాజెక్టు నుంచి చిగురుమామిడి మండలానికి సాగునీరు వస్తున్నాయన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు నుండి మండలానికి సాగునీరు అందడం లేదన్నారు.ఈ ప్రాంతంలో పేద ప్రజలకు ఓదార్పు కోసం పని చేస్తున్న నాయకుడు మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.ఈ సమావేశంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు,కొండాపూర్ సర్పంచ్ మార్క రాజు,కాంగ్రెస్ మండల యువ నాయకుడు ప్రశాంత్, సుందరగిరి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎనగందుల లక్ష్మణ్ మండల నాయకులు పాల్గొన్నారు.

# మహిళా హక్కుల రక్షణే అభివృద్ధికి మూలం

పుస్తకాల నర్సింగ్ రావు
వాస్తవం : రాజేంద్రనగర్





మహిళలకు సమాన అవకాశాలను కల్పించి వారి హక్కులను రక్షించినప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు రాజేంద్రనగర్ సిపిఐ కార్యాలయం దేవరాజ్ భవన్‌లో ఘనంగా జరిగాయి. భారత జాతీయ మహిళా సమాఖ్య రాజేంద్రనగర్ మండల అధ్యక్షురాలు మునేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పుస్తకాల నర్సింగ్ రావు, మండల కార్యదర్శి కన్య నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మహిళలకు చదువుతోపాటు ఆర్థిక శక్తి తోడైనప్పుడు నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని అన్నారు. నేటికీ మహిళలపై వివక్ష, వేధింపులు కొనసాగటం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఇంట్లో ఒక మహిళ చదువుకోవడం ద్వారా కుటుంబ సభ్యులకు క్రమశిక్షణను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. మహిళలు తమ హక్కుల కోసం నిలబడాలంటే ఆర్థికంగా ఎదగడం ఎంతో అవసరమని అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనతో దేశాభివృద్ధి తో పాటు పారిశ్రామిక రంగం బలోపేతం అవుతుందని తెలిపారు. అనంతరం సీనియర్ మహిళా నాయకులు మునీశ్వరి, సత్తమ్మ, పుష్ప, శాంతమ్మ, మణెమ్మ, యశోద, శైలజ తదితరులకు సన్మానం చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు కుక్కునూరు వాణి, బుజ్జి, ఊర్మిల, ఎం.ఏ. రియాజ్, జె. ఆనంద్ గౌడ్, విజయానంద్ గౌడ్, జి. సత్యం, సదానంద్ గౌడ్, పాండు, కృష్ణ, శ్రీను, నాగరాజ్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో మహిళా పోలీసులు కీలక పాత్ర

వేములవాడ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం
వాస్తవం : వేములవాడ



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్లో వేడుకలను నిర్వహించారు. మహిళా పోలీస్ సిబ్బంది రేణుకను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ వెంకట్రాజం మాట్లాడుతూ.... మహిళల్లో సంకల్పశక్తి ఎక్కువగా ఉంటుందని, వారు ఏ రంగంలోనైనా గొప్ప విజయాలు సాధించగలరని అన్నారు. దేశంలోని అన్ని రంగాల్లో మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకుంటూ పురుషులతో సమానంగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా అధికారులు తమ పూర్తి శక్తి, సామర్థ్యాలతో విధులు నిర్వహిస్తూ సమాజంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. పురుషుల కంటే మహిళల్లో నిబద్ధత ఎక్కువగా ఉంటుందని, పలు విభాగాల్లో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా సేవలం దిస్తున్నారని తెలిపారు. పోలీస్ స్టేషన్లలో రిసెప్షన్ విధులు, కోర్టు డ్యూటీ ఆఫీసర్, రైటర్, పెట్రోలింగ్, బ్లూ కోట్స్, సైబర్ వారియర్స్, పాఠశాలలు, కళాశాలల్లో షీ టీమ్స్ ద్వారా సైబర్ క్రైమ్‌లపై అవగాహన కార్యక్రమాలు, ముఖ్యమైన బందోబస్త్ బాధ్యతలను మహిళా పోలీస్ అధికారు లు, సిబ్బంది సమర్థంగా నిర్వహిస్తున్నారని అన్నారు. గృహహింస, వైవాహిక వివాదాల వంటి కేసుల్లో బాధిత మహిళలకు కౌన్సె లింగ్ అందిస్తూ మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని అభినం దించారు. మహిళలు పలు రంగాల్లో సాధిస్తున్న విజయాలు రాబోయే తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఐ అబ్దుల్ మజీద్, పోలీస్ సిబ్బంది రాజశేఖర్, ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ లో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళ పోలీసులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ వీరప్రసాద్, మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం పండుగ కాదు

ఐద్వా జిల్లా కన్వీనర్ జవ్వాజి విమల

**వాస్తవం: సిరిసిల్ల:** మహిళా దినోత్సవం ఒక పండుగ కాదని, ఓ ఫ్యాషన్ వేడుక, వినిమయదారీ వేదిక అస్సలు కాదు అని, మహిళా దినోత్సవం ఒక హక్కుల దినం. శ్రామిక మహిళా పోరాట సంస్మరణమని ఐద్వా రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల అన్నారు. సిరిసిల్లలోనిఅమృత లాల్ శుక్లా కార్మిక భవనంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుక సందర్భంగా జవ్వాజి విమల మాట్లాడుతూ.... సాంప్రదాయ ఊబిలో చిక్కున్న మహిళా లోకం ఒక్కొక్క అడుగు వేస్తూ సతీసహగమనం చేదించి, బాల్య వివాహాలు అడ్డుకుంటూ, వితంతు వివాహాలకు జీవం పోస్తూ, సమానత్వం సాధికారత వైపు ముందుకు సాగుతు న్నదని, అడుగడుగునా మనువాదం, చాందస వాదం వ్యతిరేకంగా సావిత్రి బాయి పూలే, మల్లు స్వరాజ్యం లాంటి ఎందరో వీరనారీమణులు సమానత్వం, సాధికారత కోసం జీవితాలను అర్పిం చారని, సమసమాజ నిర్మాణం కోసం పోరాటాలు పదును పెట్టాల్సిన సమయం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు. రజిత, మాధవి, లావణ్య, లక్ష్మి, లలిత, మౌనిక, వనిత, సరిత పాల్గొన్నారు.



# మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం సాధించాలి

**మహిళలను ఘనంగా సన్మానించిన బీఆర్ఎస్ కన్వీనర్ దొడ్డి తాతారావు**



**చర్ల : వాస్తవం**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆఫీసులో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మహిళల ఆర్థిక స్వావలంబన, చట్టసభల్లో ప్రాతినిధ్యంపై చర్చించారు. మండలంలోని ఆడబిడ్డలకు అండగా ఉంటామని హామీ ఇస్తూ, పార్టీ ఆఫీసులో , ఆదివారం జరిగిన సంతలోని మహిళలకు మిఠాయిలు తినిపిస్తూ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ స్త్రీలు సమాజంలో ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మహిళ ఉపాధ్యక్షురాలు సౌజన్య మహిళ నాయ కులు బేతం చర్ల నర్సవేణి సీనియర్ నాయకులు ఎస్ డి అజీజ్ తడికల బుల్లేబ్బాయి బిసి సెల్ అధ్యక్షుడు గోరింట్ల వెంకటేశ్వర్లు, అలవాల కృష్ణ, కనుకు వీరభద్రం, పాసిగంటి సంతోష్ వంకాయల వినోద్ ,రాణి, పలకపుష్ప, పాసిగంటి సంధ్య సోయం నాగలక్ష్మి బెండబోయిన సుహాసిని ఉప్పల నాగలక్ష్మి పాల్గొన్నారు.

# ఉరేసుకొని పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య



**వాస్తవం, మందమర్రి మార్చి 8:**

ఉరేసుకొని పదో తరగతి విద్యార్థి క్యాతం తనయ్ (16) మృతి చెందిన ఘటన ఆదివారం పట్టణంలో తీవ్ర విషాదం నింపింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని యాపిల్ సీఎస్పీ రోడ్డుకు చెందిన క్యాతశీ తనయ్ సింగరేణి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువు తున్నాడు. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడటంతో తీవ్ర ఒత్తిడికి గురై, ఎంత చదివినా తనకు మార్కులు రావేమోనని గత కొద్ది రోజులుగా తల్లిదండ్రుల వద్ద ఆవేదన చెందు తున్నారు. ఈ క్రమంలో విద్యార్థి తండ్రి ఆదివారం తెల్లవారు జామున నిద్రలేపి చదువుకోమని చెప్పి మళ్ళీ నిద్రపోయారు. కుటుంబ సభ్యులు తెల్లవారి నిద్ర లేచి బయటకు వచ్చి చూడగా, ఇంటి ముందున్న రేకుల షెడ్డు ఇనుప పైపుకు తాడుతో ఉరివేసుకొగా కుటుంబ సభ్యులు హుటా హుటిన కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. సంఘటన స్థలంలో మృతుడు రాసిన లేఖ లభించగా అందులో సారీ మమ్మీ, ఐ లవ్ యు డాడీ, సారీ శ్రీనిధి అని రాసి ఉంది. పరీక్షల సమయంలో మానసిక ఆందోళన వల్లే తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుని తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణ ఎస్సై గోపతి నరేష్ మృతదేహాన్ని పరిశీలించి పోస్ట్ మార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.